# కలిమి—లేమి

అయ్యోకూతురా! మమ్మల్నొదిలి వెళ్ళిపోయావా తల్లీ! అని ఎలుగెత్తి ఏడుస్తోంది ఒక తల్లి. తెల్లవారు ఝాము అయిదయుంటుంది. పల్లెటూళ్ళలో అయితే ఈ వేళకే వీధులన్నీ సందడిగ ఉంటాయి. అందరూ లేచి పనులు చేసుకుంటూ వుంటారు. బస్తీలలో అంత తొందరగా లేచి చేసుకోవలసిన పను లెక్కువ వుండవు. అందువల్లే 5 గంటలకు చాల ప్రశాంతముగ ఉంది. ప్రశాంతతను భగ్నముచేస్తూ ఒక్కసారిగ రోధన ధ్వనులు వినిపించినవి.

నేను తొందరగ వీధి తలుపు తీసుకొని వీధిలోకివచ్చి చూచాను. మా యింటిప్రక్కనున్న కామాక్షమ్మ ఇంటి ముందు జనము మూగి ఉన్నారు. విషయమేమిటో తెలుసుకుందామని వెళ్ళానక్కడికి. ఇంట్లో చనిపోతే ఇల్లు విడిచి పెట్టాలిసి వస్తుందని ప్రాణం పోతూ పోతూ ఉండగా ఆ ఏడేళ్ళ పిల్లను బయటకు చేర్చారట. ఆ పిల్ల తల్లి, తండ్రి, అక్క, చెల్లెళ్ళు, ఇంకా తదితర చుట్టాలు ఏడుస్తున్నారు. వారందరూ ఆ పిల్ల ఎట్లా చనిపోయిందీ వర్ణించుకుంటూ ఏడుస్తున్నారు. ఆ పిల్ల రాత్రికి రాత్రి కలరా వచ్చి గంటల మీద ఎగిరిపోయిందట. ఎంతమంది డాక్టర్లు మందులిచ్చినా లాభం లేకపోయిందట.

కొద్దిగ జ్ఞాపకం వస్తోంది. రాత్రి 3 గంటల ప్రాంతములో కామాక్షమ్మ ఇంటికి కార్లు రావటము, గడబిడగ మాటలు వినిపించినవి. భాగ్యవంతుల ఇళ్ళకు సామాన్యముగ దూరపు బంధువులకు కూడ ప్రేమ లెక్కువై చూచిపోదామని, వారిని విడిచి వెళ్ళలేక అక్కడే పదిరోజులు తిష్ఠవేసుకు కూర్చోటానికి వస్తూ ఉంటారు. అట్లానే తెల్లవారుఝామున ఎవరో చుట్టాలొచ్చారనుకున్నాను. చుట్టాలు రావటానికి వేళలు కూడ ఉండవు కదూ!

మా యింటి చుట్టుప్రక్కల నాలుగయిదు రోజులనుండి కలరావల్ల ఎవరో ఒకరు చనిపోతున్నారు. ఈ రోజు కామాక్షమ్మ కూతురు ఏడేండ్ల ప్రమీల కలరా కావుతయ్యింది. ఆ అమ్మాయి మా అందరికీకూడ చాల ముద్దుగ ఉండేది. పెద్ద వాళ్ళు చనిపోయినప్పటికన్న ఈ వయస్సు పిల్లలు పోయినప్పుడే ఎక్కువ బాధగ ఉంటుంది. చిన్నపిల్లలు వాళ్ళ ముద్దు మాటలతో, చిలిపి చేష్టలతో, నిర్మల ప్రవర్తనలతో, కల్మష రహిత హృదయాలతో అందరికీ ప్రేమ పాత్రులవుతారు.

తెల్లవారింది. పరామర్శించటానికి చాల మంది వస్తున్నారు. మా యింటి ముందున్న ఖాళీ జాగాలో గుడిశె వేసుకు వుంటున్న ఎరికిది నాగమ్మ కూడ పనిలోకి వెళుతూ మమ్మల్నందరినిచూసి అక్కడికి వచ్చింది. ఆ అమ్మాయి ఎట్లా చనిపోయిందని అందరిని అడుగుతూ నా దగ్గర కొచ్చింది. విసుక్కుకుండ కొంచెము ఓపికగానే ఎట్లా చనిపోయిందీ చెప్పాను. అంతా విని నాగమ్మ తన పిల్ల లేమయ్యారో, ఎట్లా ఉన్నారో అని త్వర త్వరగ గుడిశెలోకి తిరిగివెళ్ళింది. తన పిల్ల లీడు పిల్ల లెవరైనా ఏదైనా ఆపదలో ఉండగా చూస్తే ఏ తల్లికైనా వెంటనే తన పిల్లలు సుఖంగా ఆడుకుంటూ వుండగా తనివితీర చూచుకొనేవరకూ మనస్సు కుదుటపడదు. నాగమ్మ గుడిసెవైపు చూశాను. తన పిల్లల నుముగ్గురిని దగ్గఱకు తీసుకొని తనిదీర చూసుకొని హృదయారాటము తీర్చుకొంటోంది.

ఆరోజే సాయంత్రము 6 గంటలకు సంధ్యాచీకటిలో మా యింటి ముందున్న గుడిశెలోనుండి రోదనధ్వని వినిపిస్తోంది. ప్రొద్దుటిలాగనే వీధిలోనికి వచ్చిచూచాను. నా కాళ్ళు నాకు తెలియకుండగనే నాగమ్మ గుడిశెవైపుకు దారి తీసినవి. గుడిశెలోనే పిల్లను (చనిపోయిందని) వడిలో పెట్టుకుని నాగమ్మ ఏడుస్తోంది. మిగతా యిద్దరూ చిన్నపిల్లలు "అమ్మా! ఆకలి!" అని ఏడుస్తున్నారు. ఏడవకమ్మా అని అనే వాళ్ళొక్కరుకూడ లేరు ఆమెకు. ఆరోజు ప్రొద్దుటే కామాక్షమ్మ ఇంటిముందు వీధిలో వచ్చేపోయే జనము, చుట్టప్రక్కల వాళ్ళు ఒకటే మూగిపోయారు. కాని ఇప్పుడు నాగమ్మ గుడిశెవారిలో ఏఒక్కరికి కూడ కనుపించటంలేదు. ఒక్కొక్కసారి మనుష్యులు కళ్ళుండి కళ్ళులేనివాళ్ళవలె ప్రవర్తిస్తారు. ఒక్కొక్కసారి వారే వారి కళ్ళకు, చెవులకు అనవసరంగా ఎక్కువ పనికల్పిస్తారు. పాపం! ప్రొద్దుట కామాక్షమ్మ ఇంటిముందు ఒక్క నిముషం


గెలవండి! రూ. 5,000
బహుమతులు
1, 2 క్రాసువర్డ్సు ఇప్పుడే
తెలుగులో బయలు దేరినవి
ఎంట్రీ కూపనులు ఉచితముగా పంపబడును. ఎంట్రీ కూపనులు సేకరించి పంపు కలెక్టర్లు ప్రతి వూరియందు కావలయును. నేడే వ్రాయండి:
మురళీ క్రాసువర్డ్సు
(గవర్నమెంటు రిజిస్టర్ నెం 1894)
పలమనేరు — చిత్తూరుజిల్లా.



కార్బైడ్




కొత్త లాంతర్లు. ధరలు తగ్గింపబడినవి 5 సం॥లు గ్యారంటి. గవర్నమెంటు ఆఫీసులలో అంగీకరింపబడినవి. మంచి ప్రకాశవంతమైన వెలుతురు యిచ్చును వెంటనే ఆర్డరివ్వండి. అంత తక్కువ ఖరీదుకు యితరచోట్ల దొరకవు. ఖరీదు రు 18/- లు పోస్టేజి వగయిరా రు 5/- లు మూడువారాలు తర్వాత ఖరీదు రు. 36/- లు.

INTERNATIONAL TRADERS
(A. D.) P. B. 6756, CALCUTTA-7.

లో శ్రమ అనుకోకుండా రెక్కలు కట్టుకు వాలారు ఎంతోమంది. డబ్బున్న కామాక్షమ్మకు అండలు, పరామర్శలు ఎక్కువవుతున్నాయి. పాపం నాగమ్మకు నిరాశ, నిస్పృహ లెక్కువవుతున్నాయి.

తమ బాధను ఇతరులతో చెప్పుకుంటే కొంత ఉపశాంతి కలుగుతుంది. నాగమ్మ ఏడుస్తూనే తన విషయమంతా నాతో చెప్పింది. భర్త చనిపోయి రెండేండ్లయిందట. ముగ్గురు పిల్లలట. చనిపోయింది పెద్దపిల్ల. ఇంచుమించు కామాక్షమ్మ పిల్ల ఈడే ఉంటుందీ పిల్లకుకూడ. రెండో పిల్లకు నాలుగయి దేళ్ళుంటాయి. ముడోవాడికి రెండో, మూడో ఏళ్ళుంటాయి. నాగమ్మకు వాళ్ళు ఎప్పుడు పుట్టింది, వాళ్ళ సరిఅయిన వయస్సు ఏమి గుర్తుంటుంది? కామాక్షమ్మ పిల్లలవలె తన పిల్లల కేమయినా పుట్టినరోజు పండుగలు చేస్తోంది గనక నా గుర్తుండటానికి. ఆ పెద్దపిల్ల గుడిశెలోనే డోకులు, విరేచనములు నెళ్ళి తను పనిలోనుండి తిరిగి ఇంటికి వచ్చేటప్పటికి చచ్చి పడిఉందట.

కాసేపటికి ఎవరో ఇద్దరు ఎరికలవాళ్ళు వచ్చి ఆ శవాన్ని తీసుకు వెళ్ళి పాతిపెట్టి వచ్చారు. "పనిచేసి తెచ్చుకున్న డబ్బు ఆ పిల్లను పాతిపెట్టడానికి ఖర్చయిపోయింది. చిన్నపిల్ల లిద్దఱకు తిండి పెడదామంటే చిల్లిగవ్వ లేదు తల్లీ" అని ఏడ్చింది. చనిపోయిందని ఒక ఏడుపు, తిండిలేదని రెండో ఏడుపు.

ఇంటికి వచ్చిన తరువాత మా మామ్మ వాళ్ళు సతాయించటము మొదలుపెట్టారు. మా యింటిప్రక్కలవాళ్ళు 'దీనబంధు'వని ఇంకా ఏవో సూటీ పోటీమాట లన్నారు. వీరూ బాగుపడరు, ఇంకొకరినీ బాగుపడనీయరు' అన్నట్లుగ ఉంటుంది కొందఱి ప్రవర్తన.

మరుచటి రోజునుండే ఏడుపు దిగమ్రింగి నాగమ్మ పనిలోకి యథాప్రకారంగా వెళ్ళుతోంది. పనిలోకివెళ్లక మిగతా ఇద్దరు పిల్లల్ని కూడ చంపుకుంటుందా తిండి పెట్టక.

"కూతురు చచ్చి పూర్తిగ ఒక రోజు అవలేదు. అప్పుడే నాగమ్మ పనికి ఎట్లా వెళుతోందో! ఆ!! అలగా వాళ్ళకు ప్రేమలు, అపేక్షలు ఉంటాయా! కామాక్షమ్మగారు చూడు, నిన్నటి నుంచి ఆ విధాన ఎట్లా పడి ఉందో అన్నము నీరు ముట్టకుండా" అంది నాతో మా మామ్మ.

కామాక్షమ్మ రెండు రోజులు కాదు గదా పది రోజులు పడి ఉన్నా బాధ లేదు. సంపాదించి పెట్టక్కర్లేదు. వండి పెట్టక్కర్లేదు. డబ్బు తగలేశినంత ఉంది. వండి పెట్టటానికి వంటవాళ్ళుంటారుగా భాగ్యవంతులకు. ఇప్పటికే చుట్టాలు చాలమంది వచ్చారు. ఇంకా వచ్చి పడుతున్నారు. వండి పెడుతున్నారు. తింటున్నారు. పెళ్ళిళ్లులాగ ఉంది. పెళ్ళిలో సంతోషముగ తిరుగుతారు. ఇప్పుడు కొంచెము విచారముగ తిరుగుతున్నారు. అదే తేడా రెండింటికి.

నాగమ్మకెవరున్నారు. తిండి తినకుండా పనికి వెళ్ళకుండా పడి ఉంటే తన మిగతా పిల్లలను చూచేవాళ్ళెవరు. ఎవరైనా తన కులము వాళ్ళు ఒకరిద్దరు పరామర్శించి, ఒకటి రెండు రోజులు ఉండి పోదామని వస్తే మాత్రము తనెక్కడినుంచి తెచ్చి వాళ్ళకు పెడుతుంది. ★

